క్లుప్తంగా

విజయవాడ వెళ్లి పింఛన్ అందజేత




పింఛన్ ఇచ్చేందుకు పేషెంట్ దుర్గారావుతో వేలిముద్ర వేయిస్తున్న వలంటీర్ తులసి

ద్వారకాతిరుమల: మండలంలోని గుణ్ణంపల్లి పంచాయతీ మహదేవపురం గ్రామానికి చెందిన డయాలసిస్ పేషెంట్ కంకిపాటి దుర్గారావు గత కొద్ది రోజులుగా విజయవాడ ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ క్రమంలో గ్రామ వలంటీర్ కె.తులసి మంగళవారం విజయవాడ ఆస్పత్రికి వెళ్లి దుర్గారావుకు రూ.10 వేల పింఛన్ సొమ్మును అందించారు. ఈ సందర్భంగా వలంటీర్‌ను సచివాలయ సిబ్బంది, వైఎస్సార్ సీపీ నాయకులు, పార్టీ సోషల్ మీడియా కోఆర్డినేటర్ వసంతాటి శ్రీనివాస్ తదితరులు అభినందించారు.

నేడు పాఠశాలలకు సెలవు

బుట్టాయగూడెం: మిచాంగ్ తుపాను కారణంగా బుధవారం కూడా జిల్లా కలెక్టర్ ఆదేశాలతో బుట్టాయగూడెం మండలంలోని పాఠశాలలకు సెలవు ప్రకటించినట్లు ఎంఈఓ టి.బాబూరావు తెలిపారు. మంగళవారం సాయంత్రం ఆయన మాట్లాడుతూ తుపాను కారణంగా సోమ, మంగళవారాలు పాఠశాలలకు సెలవు ప్రకటించడం జరిగిందని అన్నారు. అయితే తుపాను ప్రభావం జిల్లాలో బుధవారం కూడా ఉండే అవకాశం ఉన్నందున కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా విద్యాశాఖాధికారి అన్ని పాఠశాలలకు సెలవు ప్రకటించినట్లు ఆయన తెలిపారు.

బాలాలయంలోకి కనకదుర్గమ్మ



బాలాలయంలో శ్రీచక్రసహిత కనకదుర్గమ్మ విగ్రహ ప్రతిష్ట

కొయ్యలగూడెం: శ్రీ చక్ర సహిత కనకదుర్గమ్మ బాలాలయ ప్రవేశ కార్యక్రమం సోమవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. అమ్మవారి నూతన ఆలయ నిర్మాణ నేపథ్యంలో ప్రస్తుతం ఆలయంలో కొలువుదీరిన అమ్మవారికి హోమ పూజల ద్వారా బ్రహ్మశ్రీ మామిళ్ళపల్లి శివానంద శర్మ విశేష పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారి శరణు ఘోష మధ్య మూలవిరాట్ విగ్రహాన్ని తాత్కాలికంగా ఏర్పాటు చేసిన బాలాలయంలో ప్రతిష్టించారు. ఈ నెల 14వ తేదీ నూతన ఆలయ నిర్మాణ శంకుస్థాపన నేపథ్యంలో తాత్కాలికంగా బాలాలయాన్ని నిర్మించారు. నూతన ఆలయ నిర్మాణం పూర్తయ్యేవరకు అమ్మవారికి బాలాలయంలోనే నిత్య పూజాది కైంకర్యాలు నిర్వహిస్తామని అర్చకులు సుబ్రహ్మణ్యశర్మ తెలిపారు.

నేలవాలిన వరి.. తడిసిన వేరుశనగ



లక్కవరంలో తడిసిన వేరుశనగతో రైతులు

జంగారెడ్డిగూడెం రూరల్: తుపాను ప్రభావంతో కురిసిన వర్షానికి జంగారెడ్డిగూడెం మండలంలో వరి, వేరుశనగ పంటలు తడిసి ముద్దయ్యాయి. పంగిడిగూడెం, లక్కవరం, దేవులపల్లి, పుట్లగట్లగూడెం, గురవాయిగూడెం, నాగులగూడెం గ్రామాల్లో 20 ఎకరాల్లో వరి నేలకొరిగినట్లు, 30 ఎకరాల్లో కోతలు పూర్తయి కల్లాల్లో ఉంచిన ధాన్యం రాశులలోకి నీరు చేరినట్లు మండల వ్యవసాయాధికారి పోశారావు తెలిపారు. అలాగే మైసన్నగూడెం, వేగవరం ప్రాంతాల్లో 100 ఎకరాల్లో వర్జీనియా పొగాకు నీట మునగగా, లక్కవరం, నాగులగూడెం, గురవాయిగూడెం ప్రాంతాల్లో 20 ఎకరాల్లో కోసిన వేరుశనగ తడిసిముద్దయిందన్నారు.

పారిశుద్ధ్యంపై అప్రమత్తంగా ఉండాలి

గణపవరం: భారీ వర్షాల కారణంగా ప్రతి ఒక్కరూ పారిశుద్ధ్యంపై అప్రమత్తంగా ఉండాలని గణపవరం, పిప్పర పిహెచ్‌సీ వైద్య అధికారులు ప్రజలకు సూచించారు. తుపాను కారణంగా భారీ వర్షాలు కురుస్తుండటంతో వైద్య సిబ్బంది గ్రామాల్లో ఫీవర్‌సర్వే నిర్వహిస్తూ, జ్వరం, ఇతర అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వారికి మందులు అందజేశారు. ఈ సందర్భంగా వారు పారిశుద్ధ్య నిర్వహణపై ప్రజలకు పలు సూచనలు చేశారు. ఇంటి పరిసరాలలో నీరు నిల్వలేకుండా చూసుకోవాలన్నారు. కాచి చల్లార్చిన నీటినే తాగాలని, వేడిగా ఉన్న ఆహారం తీసుకోవాలని సూచించారు. గ్రామాల్లో వైద్య సిబ్బంది ఇంటింటికీ తిరిగి ఆరోగ్య సర్వే, ఫీవర్ సర్వేలు నిర్వహించారు.


తుపానుతో అస్తవ్యస్తం



ద్వారకాతిరుమల: ఎం.నాగులపల్లిలో నీట మునిగిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ సతీష్, ఏవో దుర్గారమేష్

బుట్టాయగూడెం: మిచాంగ్ తుపాను ప్రభావంతో గడచిన రెండు రోజులుగా పశ్చిమ మన్యంలో భారీ వర్షాలు కుండపోతగా కురుస్తున్నాయి. అధిక వర్షాల వల్ల బుట్టాయగూడెం, జీలుగుమిల్లి మండలాల్లో పలు చోట్ల పంటలు నీట మునిగాయి. వరి, వర్జీనీయా పొగాకు, వేరుశనగ, మొక్కజొన్న పంటలు ఎక్కువగా నీట మునిగాయి. కొండవాగులు పొంగి పొర్లాయి. జీలుగుమిల్లి నుంచి కామయ్యపాలెం వెళ్లే రహదారిపై వాగు ఉధృతంగా పొంగింది. రెండు రోజులుగా వాతావరణంలో చోటు చేసుకున్న మార్పులు, ఈదురు గాలులతో గిరిజన ప్రాంతంలో విపరీతంగా చలికూడా పెరిగింది. భారీగా కురుస్తున్న వర్షాల కారణంగా జనజీవనం పూర్తిగా స్తంభించిపోయింది. రోజువారీ పనులకు వెళ్లే పేదలు, తోపుడు బళ్ల వ్యాపారం చేసుకునే వారు వర్షాల కారణంగా ఇళ్లకే పరిమితమయ్యారు. కాగా బుట్టాయగూడెం మండలంలో కురిసిన ఈదురు గాలులు, వర్షాల కారణంగా సుమారు 153 ఎకరాలు పంట పడిపోయినట్లు వ్యవసాయాధికారులు తెలిపారు. వీటిలో వరి 137 ఎకరాలు, ప్రత్తి 16 ఎకరాలు నేలవాలయాయన్నారు. అలాగే 18 ఎకరాల్లో వరి, 31 ఎకరాల్లో వేరుశనగ పంట నీట మునిగినట్లు చెప్పారు. మొత్తం 49 ఎకరాలు పంట నీట మునిగిందని ఏఓ బి. సుమలత తెలిపారు. వర్జీనియా పొగాకు పంట కూడా నీట మునగడంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. అదేవిధంగా జీలుగుమిల్లి మండలంలో కూడా వరి, మొక్కజొన్న, పొగాకు వేరుశనగ పంటలు నీట మునిగాయి.

కుక్కునూరు: తుపాను ప్రభావంతో మండల వ్యాప్తంగా సోమవారం సాయంత్రం నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షంతో కొండవాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. రోడ్లన్నీ వరద నీటితో జలమయమయ్యాయి. లోతట్టు ప్రాంతాలలోని ఇళ్లలోకి వరద నీరు చేరింది. అకాల వర్షంతో పత్తి రైతులు తలలు పట్టుకుంటున్నారు. పత్తి పంట ఎదిగే సమయంలో వర్షాలు లేక దిగుబడి తగ్గిందని, ఇప్పుడు కోతల సమయంలో కురిసిన వర్షంతో పత్తి నల్లబడుతుందని రైతులు వాపోతున్నారు. అటు మిర్చి రైతులు కూడా వర్షం ప్రభావం ఎలా ఉంటుందోనని ఆందోళన చెందుతున్నారు.



జంగారెడ్డిగూడెం: డివిజన్‌లో నీట మునిగిన వర్జీనియా పొగాకు

నష్టపోయిన రైతులు.. స్తంభించిన జనజీవనం

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం డివిజన్‌లో తుపాను ప్రభావంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఉదయం నుంచి రాత్రి వరకు కుండపోత వర్షం కురవడంతో జనజీవనం పూర్తిగా స్తంభించింది. లోతట్టు ప్రాంతాలు, ప్రధాన రహదారులు జలమయం అయ్యాయి. ప్రధానంగా వాణిజ్య పంట వర్జీనియా పొగాకుకు డివిజన్‌లో తీవ్ర నష్టం జరిగింది. జంగారెడ్డిగూడెం రెండు వేలం కేంద్రాల పరిధిలో ఉన్న గ్రామాల్లో వర్జీనియా పంటకు తీవ్ర నష్టం సంభవించింది. ఇటీవలే నాటు వేసి ఎదుగుతున్న వర్జీనియా పంటను తుపాను తీవ్రంగా దెబ్బతీసింది. దీంతో వర్జీనియా రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. ఇక వరి పంట కొంతమేర నేలకొరగగా, మరికొంత నీట మునిగింది. కోతకోసిన వేరుశెనగ పంట కూడా తడిచి నష్టం సంభవించింది. కల్లాల్లో బస్తాలో వేసిన ధాన్యాన్ని యుద్ధ ప్రాతిపదికన అధికారులు గోడౌన్‌లకు తరలించే ఏర్పాట్లు చేశారు. ఇక బస్తాలో నింపిన కొంత వరి పంట ధాన్యం కుప్పలకు బరకాలు కప్పి తడవకుండా రైతులు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఇదిలా



జంగారెడ్డిగూడెం: ఎడతెరిపి లేని వానతో బుట్టాయగూడెం రోడ్డు జలమయం

ఉండగా, బుట్టాయగూడెం మండలం బండార్లగూడెంలో తుపానుకు ఒక పాక నేలకొరిగింది. అక్కడక్కడ కొన్ని ఇళ్లు పాక్షికంగా దెబ్బతిన్నాయి. అధికారులు ప్రాథమిక అంచనాలు తయారు చేస్తున్నారు. ఇదిలా ఉంటే జంగారెడ్డిగూడెం ఆర్డీవో కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. బుధవారం ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు భాస్కరరావు 95734 81406 నంబర్‌లో అందుబాటులో ఉంటారు. అలాగే మధ్యాహ్నం 2 నుంచి రాత్రి 10 గంటల వరకు చంద్రరరావు 75690 90898, రాత్రి 10 గంటల నుంచి గురువారం ఉదయం 6 గంటల వరకు వెంకటేశ్వరరావు 94900 82303 నంబర్లలో అందుబాటులో ఉంటారు. కాగా, మంగళవారం ఉదయం వరకు జంగారెడ్డిగూడెం డివిజన్‌లో 239.2 మీ.మీ. వర్షపాతం నమోదైంది. జంగారెడ్డిగూడెంలో 37.8 మి.మీ., బుట్టాయగూడెంలో 22, జీలుగుమిల్లి 29.6, కొయ్యలగూడెంలో 36.8, పోలవరం 19.2, కామవరపుకోటలో 24.6, ద్వారకాతిరుమలలో 20, కుక్కునూరు 12, వేలేరుపాడు 12, టి.నరసాపురంలో 25.2 మి.మీ. చొప్పున వర్షపాతం నమోదైంది. కాగా పట్టణంలోని సీతామహాలక్ష్మి వృద్ధాశ్రమంలోకి వరదనీరు చేరడంతో ఆశ్రయం పొందుతున్న 15 మంది వృద్ధులు, నిర్వాహకులు నిరాశ్రయులయ్యారు. దీంతో మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి స్థానిక చంద్రశేఖర కల్యాణ మండపంలో వారికి వసతి, భోజనం ఏర్పాటు చేశారు.

పంటలు నీటిపాలు

ద్వారకాతిరుమల: మిచాంగ్ తుపాను కల్లోలం సృష్టించింది. ఎడతెరిపిలేకుండా ఈదురు గాలులతో కురుస్తున్న వర్షం రైతన్నల పంటను నీటిపాలు చేసింది. అలాగే పలు ప్రాంతాల్లో చెరువులు గండ్లు పడ్డాయి. దాంతో దిగువ ప్రాంతాలకు వరదనీరు ఉధృతంగా ప్రవహిస్తోంది. ప్రధాన రహదారులు సైతం కాలువలను తలపిస్తున్నాయి. ద్వారకాతిరుమల తహసీల్దార్ పి.సతీష్, ఏవో దుర్గారమేష్ మంగళవారం ఎం.నాగులపల్లి, పి.కన్నాపురం, బుట్టాయిగూడెం గ్రామాల్లో పర్యటించి, రైతులను అప్రమత్తం చేశారు. వారి పొలాల్లోకి వెళ్లి నీట మునిగిన ధాన్యం రాసులను, పంటలను స్వయంగా పరిశీలించారు. వర్షం తెరిపిచ్చిన వెంటనే చేలల్లో ఉన్న ధాన్యాన్ని సురక్షిత ప్రాంతాలకు తరలించాలని రైతన్నలకు సూచించారు

ఎడతెరిపి లేని వానతో..



తడిసిన వరి పనలను చూపిస్తున్న రైతు

పోలవరం రూరల్: తుపాను ప్రభావంతో గత రెండు రోజులుగా ఎడతెరిపి లేని వర్షం కురుస్తోంది. ఏకధాటిగా కురుస్తున్న వర్షానికి రైతులు కల్లాల్లో, రోడ్లపై ఆరబెట్టిన ధాన్యాన్ని తడవకుండా రక్షించుకునేందుకు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు మండలంలో ధాన్యాన్ని రైతుల నుంచి ఆర్‌బీకేల ద్వారా కొనుగోలు చేసి మిల్లర్లకు తరలించేందుకు మండల స్థాయి అధికారులు తహసీల్దార్ బి.సుమతి, మండల వ్యవసాయ శాఖాధికారి ఎం.రాంబాబు రైతలతో చర్చించారు. పోలవరం పట్టిసీమ, గూటాల ప్రాంతాల్లో రైతులు వద్ద ఉన్న ధాన్యం రాశులను తక్షణమే మిల్లులకు తరలించేందుకు మిల్లర్లతోను, లారీ ఓనర్స్‌తోనూ ఫోన్‌లో సంప్రదించి తరలించే ఏర్పాట్లు చేపట్టారు. పల్లపు ప్రాంతాల్లో వరి మినప చేలల్లోకి కొద్దిపాటి వర్షం నీరు చేరడంతో రైతులు బోదెలు తవ్వుకుని నీరు మళ్లించుకుంటున్నారు. మరో రెండు రోజులు వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున రైతులు అప్రమత్తంగా ఉండాలని, ధాన్యాన్ని జాగ్రత్త చేసుకోవాలని అధికారులు సూచించారు.



బుట్టాయగూడెం: జీలుగుమిల్లి మండలం వంకవారిగూడెంలో వరి పంట దుస్థితి



కుక్కునూరు: వర్షాలకు నల్లబడుతున్న పత్తి పంట



జంగారెడ్డిగూడెం: అశ్వారావుపేట రోడ్డులో ఇలా..



బుట్టాయగూడెం: వర్షాలకు నీటమునిగిన పొగాకు పంట

అన్నదాతలూ.. ఆందోళన వద్దు

చింతలపూడి: చింతలపూడి మండలంలో తుపాను ప్రభావంతో ఎడతెరపిలేకుండ కురుస్తున్న వర్షాలతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం కోతకు సిద్ధంగా ఉన్న వరి చేలు భారీ వర్షాలకు నేలకొరిగాయి. కోతలు కోసి కల్లాల్లో ఆరబెట్టుకున్న ధాన్యం ఎక్కడ తడిసిపోతుందోనని రైతులు టార్పాలిన్ కవర్లు కప్పి ధాన్యానికి రక్షణ కల్పించడానికి తాపత్రయపడుతున్నారు. ఇదిలా ఉండగా తహసీల్దార్ కృష్ణజ్యోతి, మండల వ్యవసాయాధికారిణి మీనాకుమారి మంగళవారం మండలంలో పర్యటించి పంట పొలాలను పరిశీలించారు. రైతులు ఆరబెట్టుకున్న ధాన్యాన్ని పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. రైతులు అధైర్య పడవద్దని ఎప్పటికప్పుడు పరిస్థితులను ఉన్నతాధికారులకు నివేదిస్తున్నట్లు చెప్పారు. కల్లాల్లో వర్షం నీరు నిల్వ ఉండకుండా జేసీబీతో నీరు బయటికి వెళ్ళడానికి కాల్వలు తీశారు.ఈ సందర్భంగా తహసీల్దార్ కృష్ణజ్యోతి మాట్లాడుతూ మండలంలో 8 వేల ఎకరాల్లో ఇంకా వరి కోతలు కోయాల్సి ఉందని తెలిపారు. కల్లాల్లో ఆరబెట్టుకున్న ధాన్యం సుమారు 2,200 మెట్రిక్ టన్నులు ఉంటుందని తెలిపారు.



చింతలపూడి మండలంలో కల్లాల్లో ఆరబెట్టిన ధాన్యాన్ని పరిశీలించిన తహసీల్దార్, ఏవో

ఉద్యాన రైతులు జాగ్రత్తలు పాటించాలి

చింతలపూడి: భారీ వర్షాలు పడుతున్న నేపథ్యంలో ఉద్యాన రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని చింతలపూడి ఉద్యాన వన శాఖ అధికారిణి ఎండీ షాఫియ పర్వీన్ మంగళవారం ఒక ప్రకటనలో సూచించారు. ముందుగా తోటలో నిలిచినా నీటిని బయటకి పంపించాలన్నారు. కూరగాయల తోటలకు సంబంధించి వర్షాలు తగ్గాక 19:19:19 లేదా 13:0:45 లేదా యూరియా వంటి పోషకాలు పిచికారీ చేయాలన్నారు. పొలంలో నీరు నిలవడం వలన ఎండు తెగులు, ఆకు మచ్చ తెగులు ఆశించే అవకాశం ఉందని, నివారణకు కాపర్ ఆక్సీక్లోరైడ్ 3 గ్రామ ఒక లీటరు నీటికి, కార్బన్‌డిజమ్ 1 గ్రామ 1లీటరు నీటికి మొక్క మొదల్లో పోయాలన్నారు. అరటి తోటలకు సంబంధించి మొక్కలకు కర్రలు కట్టాలన్నారు. సిద్ధంగా ఉన్న కాయలు కోసివేయాలన్నారు. వర్షం తగ్గాక యూరియా 100గ్రా, పోటాష్ 80గ్రా చొప్పున మొక్కకు వేయాలన్నారు. బొప్పాయి తోటలకు సంబంధించి మొక్కలకి కర్రలు కట్టడంతో పాటు వర్షం తగ్గాక కాపర్ ఆక్సీక్లోరైడ్ లీటర్ నీటికి 3 గ్రాములు వేసి పిచికారీ చేయాలన్నారు. అలాగే నిర్ధేశించిన ఎరువులు వేసుకోవాలని సూచించారు.

ప్రైవేట్ ఎలక్ట్రికల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడిగా బాలిన

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం డివిజన్ ప్రైవేట్ ఎలక్ట్రికల్ వర్కర్స్ యూనియన్ సర్వసభ్య సమావేశం ధర్మన్న స్మారక భవనంలో మంగళవారం నిర్వహించారు. ఈ సమావేశంలో నూతన కమిటీని ఎనుకున్నారు. అధ్యక్షుడిగా బాలిన ధర్మరాజు, ప్రధాన కార్యదర్శిగా తీయ్యల గణేష్, ఉపాధ్యక్షుడిగా ఎరుబండి వీర్రాజు, సహాయ కార్యదర్శిగా తారిపిరెడ్డి కృష్ణ, కోశాధికారిగా కోట శివకృష్ణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికల ప్రెసిడెంట్ అధికారులుగా గెద్దం రమేష్, పుత్సల శ్రీను వ్యవహరించారు. ఐఎఫ్‌టీయూ జిల్లా ఉపాధ్యక్షుడు సరియం రామ్మోహన్ నూతన కమిటీచే ప్రమాణ స్వీకారం నిర్వహించారు. ఐఎఫ్‌టీయూ రాష్ట్ర కోశాధికారి కేవీ రమణ నూతన కమిటీకి అభినందనలు తెలియజేశారు. ప్రైవేట్ ఎలక్ట్రికల్ వర్కర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని అన్నారు. కార్యక్రమంలో మాజీ అధ్యక్షుడు ఆవుల పుల్లారావు, బాలం నరేష్ తదితరులు పాల్గొన్నారు.



యూనియన్ జనరల్ బాడీ సమావేశంలో పాల్గొన్న నాయకులు

నేలకొరిగిన పైరు

లింగపాలెం: మిచాంగ్ తుపాను ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు లింగపాలెం మండలంలో జనజీవనం స్తంభించింది. ఉదయం నుంచి రాత్రి వరకు వర్షం కురుస్తూనే ఉండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కొన్ని గ్రామాల్లో యంత్రాలతో కోసిన ధ్యాన్యాన్ని పొలాల్లోనే రైతులు ఉంచటంతో వర్షానికి తడిసిపోయాయి. దీంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. మంగళవారం మండలంలోని పలుగ్రామాలలో ఏవో మురళీకృష్ణ పర్యటించి రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ధాన్యాన్ని భద్రపర్చుకోవాలన్నారు. తడిసిన వరిధాన్యం సైతం ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు.



లింగపాలెం మండలంలోని యడవల్లి గ్రామంలో నేలకొరిగిన వరిపైరు

ప్రతి ధాన్యపు గింజా కొనుగోలుకు చర్యలు

బుట్టాయగూడెం: ఆరుగాలం కష్టపడి అన్నదాతలు పండించిన ప్రతి ధాన్యం గింజను కొనుగోలు చేసేలా ప్రభుత్వం తగు చర్యలు చేపట్టిందని ఎమ్మెల్యే తెల్లం బాలరాజు అన్నారు. మిచాంగ్ తుపాను ప్రభావంపై నియోజకవర్గంలోని అన్ని శాఖల అధికారులతో బాలరాజు తన క్యాంప్ కార్యాలయం నుంచి మంగళవారం ఫోన్‌లో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అధిక వర్షాల పట్ల ప్రజలు అప్రమతంగా ఉండాలని ఆయన కోరారు. తుపాను ప్రభావం, వర్షాల వల్ల ఎటువంటి ఆస్తి, ప్రాణ, పంట నష్టాలు జరుగకుండా ప్రజలను, రైతులను అప్రమత్తం చేయాలని అధికారులకు సూచించారు. ఐటీడీఏ పీఓ ఎం.సూర్యతేజ, జంగారెడ్డిగూడెం ఆర్డీఓ అద్దయ్యలతో పాటు నియోజకవర్గంలో 7 మండలాలల తహసీల్దార్లు, ఎంపీడీవోతో మాట్లాడి సహాయ చర్యలు చేపట్టాలని కోరినట్లు బాలరాజు చెప్పారు. ప్రజలను లోతట్టు ప్రాంతాలకు తరలించాలన్నారు. అలాగే అధిక వర్షాలతో మన్య ప్రాంతంలో కొండ వాగుల ప్రవాహాలు ఎక్కువగా పొంగి పొర్లే అవకాశం ఉన్నందున కల్వర్టుల వద్ద పోలీసులు, రెవెన్యూ సిబ్బంది హెచ్చరికల బోర్డులు ఏర్పాటు చేయడంతో పాటు పికెటింగ్ ఏర్పాటు చేయాలని కోరారు.



తుపాను పరిస్థితులపై అధికారులతో ఫోన్‌లో మాట్లాడుతున్న బాలరాజు

రైతులూ.. ఆందోళన పడకండి

మిచాంగ్ తుపానుతో రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఎమ్మెల్యే తెల్లం బాలరాజు అన్నారు. అన్నదాతలు పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేసి ప్రభుత్వం మద్దతు ధర కల్పిస్తుందని చెప్పారు. ఇంకా వరి కోతలు మొదలు పెట్టని రైతులు వరి కోతల పనులు వాయిదా వేసుకోవాలన్నారు. అలాగే కల్లాల్లో ఉన్న ధాన్యాన్ని బరకాలు కప్పి కాపాడుకోవాలన్నారు. అలాగే వ్యవసాయ శాఖ అధికారులు అందుబాటులో ఉంటూ రైతులకు సలహాలు, సూచనలు ఇవ్వాలని కోరారు. తేమ శాతంతో పనిలేకుండా ధాన్యాన్ని కొనుగోలు చేసేలా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇప్పటికే అధికారులు ఆదేశాలు ఇచ్చారని బాలరాజు చెప్పారు. ప్రజలకు సహాయ కార్యక్రమాలు అందించేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని ఆయన కోరారు.

అధికారుల క్షేత్ర పర్యటన

టి.నరసాపురం: మండలంలో జంగారెడ్డిగూడెం ఆర్డీవో అద్దయ్య, వ్యవసాయ శాఖాధికారి ముత్యాలరావు క్షేత్ర పర్యటన చేసి రైతులను అప్రమత్తం చేశారు. పంటను కాపాడుకోవడానికి పలు సూచనలు చేశారు. వరి కోతకోసి కుప్పల మీద నిల్వ ఉంచిన ధాన్యం రాశులను పరిశీలించారు. ధాన్యం తడవకుండా జాగ్రత్తలు తీసుకోవాలని రైతులకు సూచించారు. ఇంకా కోతలు కోయాల్సిన రైతులు మరో ఐదు రోజుల వరకు కోతలు కోయవద్దన్నారు. పంటనష్టం జరిగితే ఆర్‌బీకేల్లో తెలియజేయాలన్నారు. రైతులు అధైర్యపడవద్దని, రెవెన్యూ యంత్రాంగం అందుబాటులో ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ జేవీ సుబ్బారావు, వీఆర్‌వోలు, వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.



టి.నరసాపురం: ధాన్యాన్ని పరిశీలించి రైతులకు సూచనలు ఇస్తున్న అధికారులు

కొయ్యలగూడెం: మండలంలో తహసీల్దార్ పి.నాగమణి, మండల వ్యవసాయ అధికారి ఎస్.చెన్నకేశవులు పర్యటించారు. గవరవరం, పొంగుటూరు, యర్రంపేట, రాజవరం గ్రామాల్లో పొలాలను పరిశీలించారు. మండలంలో వరి కోత చేసిన ధాన్యం 2,826 టన్నులు ఉందని అందులో 434 టన్నుల ధాన్యం కొనుగోలు పూర్తయ్యాయన్నారు. 713 టన్నులు గోనె సంచులలో ధాన్యాన్ని నింపి భద్రపరిచినట్లు తెలిపారు. మిగిలిన 182 టన్నుల ధాన్యాన్ని బరకాల ద్వారా రైతులు భద్రపరిచే విధంగా చర్యలు తీసుకున్నామన్నారు. సంచులలో నింపిన ధాన్యాన్ని మంగళవారం ఆఫ్‌లైన్‌లో కొనుగోలు చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు.



కొయ్యలగూడెం: గవరవరంలో ధాన్యం లోడును తరలిస్తున్న రెవెన్యూ, వ్యవసాయ శాఖ అధికారులు

యుద్ధప్రాతిపదికన విద్యుత్ పునరుద్ధరణ

ఏలూరు (ఆర్ఆర్‌పేట): తుపాను ప్రభావంతో విద్యుత్ ప్రసారంలో ఏర్పడిన అంతరాయాలను యుద్ధప్రాతిపదికన పునరుద్ధరిస్తున్నట్టు తూర్పుప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ ఏలూరు ఆపరేషన్ సర్కిల్ సూపరింటెండింగ్ ఇంజినీర్ పి.సాల్మన్‌రాజు తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు, చెట్లపై పడిన విద్యుత్ వైర్లు, ట్రాన్స్‌ఫార్మర్లలో ఏర్పడిన లోపాలను సరిచేసేందుకు జిల్లా వ్యాప్తంగా తమ సిబ్బంది అప్రమత్తం చేశామన్నారు. వారంతా పునరుద్ధరణ పనులు చేపట్టారని తెలిపారు. లింగపాలెం మండలం ధర్మాజీగూడెంలో విద్యుత్ లైన్లపై పడిన ఎండిన పామాయిల్ చెట్టును తొలగించారన్నారు. ఉంగుటూరు మండలం చేబ్రోలులో లైన్లపై పడిన చెట్లను తొలగించి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించినట్టు చెప్పారు. కుక్కునూరు మండలం దాచారంలో విద్యుత్ లైన్ల పునరుద్ధరణతో పాటు జిల్లా వ్యాప్తంగా అక్కడక్కడా ఒరిగిన స్తంభాలు, తెగిపడిన తీగలను సరిచేశారని, ట్రాన్స్‌ఫార్మర్లను మరమ్మతు చేశారని వివరించారు.

రైతులను ఆదుకుంటాం

భీమడోలు: రైతులు పండించిన ధాన్యాన్ని మిల్లులకు తరలించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ అధికారులను ఆదేశించారు. మిచాంగ్ తుపాను ప్రభావంతో కురుస్తున్న భారీ వర్షాన్ని సైతం లెక్క చేయకుండా జోరు వానలో ఏలూరు ఆర్డీవో ఎన్ఎస్‌కే ఖాజావలితో కలిసి మంగళవారం భీమడోలులోని వ్యవసాయక్షేత్రాలను ఆయన సందర్శించారు. రైతులు కల్లాలు, ఖాళీ స్థలాల్లో ఉంచిన ధాన్యం రాశులను పరిశీలించి రైతులతో మాట్లాడారు. రైతులు ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భరోసా కల్పించారు. రైతులు పండించిన చివరి ధాన్యం గింజ వరకు రైతుల వద్ద నుంచి ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందన్నారు.